

వైభవంగా శ్రీవారి పౌర్ణమి గరుడ సేవ



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

కంట తడిపెట్టిన సుగుణమ్మ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మాజీ ఎంఎల్ఎ ఎం.సుగుణమ్మ పట్టు వదలకుండా 'టిక్కెట్' కోసం అభ్యర్థిస్తూనే ఉన్నారు. సోమవారం మీడియా ఎదుట ఆమె నివాసంలో సుగుణమ్మ, మనవరాలు కీర్తి కన్నీటి పర్యంతమయ్యారు. మీడియాతో మాట్లాడుతూ తిరుపతి ఎంఎల్ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ కాకుండా, స్థానిక అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే తమకు ఏమాత్రం అభ్యంతరం లేదన్నారు. జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి చిత్తూరు వైసిపి ఎంఎల్ఎ కావడాన్ని తిరుపతి నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోవడం లేదన్నారు. తన కుటుంబం రాజకీయాల నుంచి వచ్చిందని, వ్యాపారాలు చేసి, కాంట్రాక్టులు చేసి పైకి రాలేదన్నారు. తిరుపతి అభ్యర్థి విషయంలో ఎన్నో సర్వేలు చేశారని, ఆ సర్వేల్లో తనకే ఎక్కువ అనుకూలంగా ఓట్లు వచ్చాయన్నారు. ఏదిఏమైనా తిరుపతి నగరంలో అసెంబ్లీకి, పార్లమెంట్‌కు వైసిపి నుంచి వలస వచ్చిన వారే అభ్యర్థులు కావడం గమనార్హం.

అందరినీ కలుపుకుపోతా : ఆరణి శ్రీనివాసులు

తిరుపతి సిటి : తిరుపతిలో ఈనెల 27వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తానని జనసేన టిడిపి బిజెపి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఓ ప్రైవేట్ హోటల్లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేన అభ్యర్థిగా తనను ప్రకటించారని, మూడు పార్టీల కలయికతో విజయం సాధిస్తానన్నారు. తిరుపతిలో అన్యాయం, అక్రమాలు, టిడిఆర్ బాండ్లు, గంజాయి రూపుమాపుతానన్నారు. వైసిపిలో తనకు అన్యాయం జరిగిందని, జనసేన నాయకులు అండగా నిలిచారన్నారు. కపిలతీర్థంలో దర్శనం చేసుకుని జీవకోన నుంచి ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ నాయకత్వం ఆరణి శ్రీనివాసులును కూటమి అభ్యర్థిగా తమ ముందు ఉంచిందని, అందరినీ సమన్వయ పరచుకుని గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో బీగాల అరుణ, మధులత, కీర్తన, బాలసుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు. అయితే టిడిపి ముఖ్య నేతలు దూరంగా ఉండటం గమనార్హం.



కూటమి ప్రెస్‌మీట్‌లో టిడిపి శ్రేణులు దూరం

కుప్పానికి 'బాబు' ఎన్నికల వరాలు

- మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతాం
- రూ.100 కోట్ల వ్యయంతో శిల్పారామం
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మ్యానిఫెస్టో



ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, కుప్పం

'కుప్పం అంటే నేను, నేనంటే కుప్పమనే గుర్తుకొస్తుంది.. ఆ విధంగా 35 ఏళ్లు ఆదరించారు. ఎనిమిదోసారి పోటీ చేస్తున్నా. లక్ష మెజార్టీ లక్ష్యంగా పనిచేస్తున్నారు. లక్ష మెజార్టీ తీసుకురండి, వైసిపి అభ్యర్థికి డిపాజిట్లు కూడా రాకూడదు. ఆ విధంగా రేయింబవళ్లు పనిచేయండి. మీ బాధ్యత నేను తీసుకుంటా.' అని సొంత నియోజకవర్గమైన కుప్పంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. నియోజకవర్గానికి ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించారు. రాష్ట్రమంతా రెండింతల అభివృద్ధి చేస్తే, కుప్పానికి మూడింతలు చేస్తానన్నారు. హైదరాబాద్‌నుంచి బెంగుళూరుకు ప్రత్యేక విమానంలో వచ్చిన చంద్రబాబునాయుడు, రోడ్డు మార్గంలో కుప్పంకు చేరుకున్నారు. సోమవారం ఉదయం నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. మహిళలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్నికల శంఖారావం పూరించారు.

'కుప్పాన్ని ఎడ్యుకేషన్, నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతా. కుప్పంలో ఇంజినీరింగ్ కాలేజీ తీసుకొస్తా. ప్రతి ఊరికి రోడ్డు, నీళ్లు ఇస్తా. బెంగుళూరు నుంచి నాలుగు లైన్స్ ఎక్స్‌ప్రెస్ లైన్ నిర్మిస్తా. చిత్తూరు జిల్లాలోనే కుప్పంను విద్యా కేంద్రంగా వర్ధిల్లేలా చేస్తా. బెంగుళూరు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి కుప్పంకు వచ్చి చదువుకునేలా చేస్తా. రామకుప్పం నుంచి తమిళనాడుకు, కుప్పం నుంచి కృష్ణగిరికి, కుప్పం - బెంగుళూరుకు అనుసంధానం చేస్తా. అన్ని కులాలకు కమ్యూనిటీ సెంటర్లు నిర్మిస్తా.. వంద కోట్ల వ్యయంతో శిల్పారామం నిర్మించి, గ్రానైట్‌ను సద్వినియోగం చేసుకునేలా ఏమందిరానికైనా దేవున్ని ఇక్కడనుంచే తయారుచేసేలా చూస్తా. 150 పడకల ఆస్పత్రిని 300 పడకలుగా చేస్తా. పాలారును పూర్తి చేసి హంద్రీనీవా నీరు ప్రతి ఎకరాకు నీళ్లు వచ్చేలా బాధ్యత తీసుకుంటా. ఈ 35 ఏళ్లలో జరిగిన అభివృద్ధి ఓ ఎత్తయితే, రాబోయే ఐదేళ్లలో మరో ఎత్తు. ఇక్కడ చదవుకున్న విద్యార్థులకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పించి వర్క్‌ఫ్రం హోం అవకాశం కల్పిస్తా. ప్రశాంతమైన కుప్పంలోఎపుడూ పచ్చదనం ఉండాలి. అయితే వైఎస్ఆర్ హయాంలో అరాచకం రాజ్యమేలింది.

పుంగనూరుకు చెందిన పెద్దిరెడ్డి హవా, దౌర్జన్యం అక్రమాలుపెరిగాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లిస్తా. కుప్పంకు వచ్చిన మొదట్లో రోజుకు వెయ్యి లీటర్ల పాలు ఉత్పత్తి అయ్యేది. ప్రతి ఇంటికి సీమ ఆవులు రెండు ఇచ్చి రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలు ఉత్పత్తయ్యేలా చూశా. భవిష్యత్‌లో పది లక్షల లీటర్లు తీసుకొచ్చేలా ప్రణాళిక ఉంది. కుప్పం నియోజకవర్గానికే ప్రత్యేకమైన మ్యానిఫెస్టో తయారు చేసి, ఆ ప్రకారం అభివృద్ధి చేస్తా. రాష్ట్ర వ్యాప్తంగా రెండింతలు అభివృద్ధి చేస్తే, కుప్పంలో మూడింతలు చేస్తా. కుప్పంలో పండిన పంటలకు గిట్టుబాటు ధర తెచ్చుకునేలా అన్ని మండలాల్లో కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తా. ఐదేళ్ల క్రితం ఇక్కడ పండించిన కూరగాయలు ఎగుమతి చేసుకునేలా విమానాశ్రయం తీసుకురావాలని చూశా. అప్పుడు సాధ్యం కాలేదు. మళ్లీ అధికారంలోకి వస్తే కుప్పంకు విమానాశ్రయం తీసుకొస్తా' అన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలు తీసుకొచ్చి, రైతులనే పారిశ్రామికవేత్తలను చేస్తానన్నారు. వేదికపై చిత్తూరు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి దుగ్గిమళ్ల ప్రసాద్‌రావు, కుప్పం ఇన్‌ఛార్జి, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పిఎస్ మునిరత్నం, గౌనివారి శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సిఆర్ రాజన్, డాక్టర్ సురేష్, చంద్రశేఖర్, డాక్టర్ వెంకటేష్, రాజ్‌కుమార్, గోపీనాథ్ పాల్గొన్నారు.



గుడిపల్లి మండలం అగరం పంచాయతీ నుంచి హేమంబార్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీగా తరలిన మహిళలు

కౌంట్‌డౌన్ మొదలు...

- 46 రోజుల్లో పోలింగ్..
- ఎన్నికల కసరత్తులో జిల్లా యంత్రాంగం
- శాంతిభద్రతలపై పోలీస్ నిఘా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు దాదాపు ఖరారు కావడంతో పోలింగ్‌కు, ప్రచారం, నామినేషన్లుకు సమయమున్నా అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నంలో సీరియస్‌గా ఉన్నారు. ఓటర్లను ఆకట్టుకొనేందుకు ఆయా నియోజకవర్గాల్లో ముఖ్యనేతలు, ఓటర్లను ప్రభావితం చేయగల వ్యక్తులో ఆత్మీయ సమావేశాల పేరిట కలస్తూ బిజిబిజీగా గడిపేస్తున్నారు...

సిద్ధమవుతున్న జిల్లా యంత్రాంగం...

సాధారణ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి నేతృత్వంలో ఎన్నికల అధికారులు సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంతో పాటు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎక్కడా పొరబాట్లకు చోటు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది.



మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు 42, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ 21 (నియోజకవర్గానికి 3 చొప్పున) ఫ్లయింగ్ స్క్వాడ్స్ 21 (నియోజకవర్గానికి 3 చొప్పున), వీడియో నిఘా బృందాలు 21, వీడియో వీక్షణ బంధాలు 14 ఏర్పాటు చేయనున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అతిక్రమించిన ప్రభుత్వ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 18వ తేదీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చింది.

శాంతి భద్రతలపై పోలీస్ నిఘా...

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికలను నిర్వహించడానికి పోలీసు యంత్రాంగం శాంతిభద్రలపై నిఘా ఉంచింది. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్రబలగాల కవాతు నిర్వహిస్తోంది. 415 పోలింగ్ కేంద్రాలు జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభం నుంచి పోలింగ్ ముగిసేంత వరకు వెబ్ కాస్టింగ్ వీడియో చిత్రీకరణ చేపట్టనున్నారు. ఇతర రాష్ట్రాల నుండీ మద్యం, డబ్బు, గిఫ్టుల రూపంలో ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి జిల్లాకు తరలించకుండా కర్నాటక, తమిళనాడు సరిహద్దుల్లో పోలీసుశాఖ 16 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 235 బైడోవర్ కేసులు నమోదు చేశారు. వీరంతా పోలీస్ నిఘా ఉండాలి. రూ.1.3కోట్ల నగదు సీజ్ చేశారు. 514 కేసులు నమోదు చేసి 8300 లీటర్లు లిక్కర్‌ను సీజ్ చేశారు. కేంద్రం నుంచి మూడు కంపెనీలు, సిఆర్‌పిఎఫ్, పిఎస్‌పి, రిజర్వు పోలీసు బలగాలు అందుబాటులో ఉన్నాయి.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి పోలింగ్ అనంతరం ఈవీఎంల భద్రతకు స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటుకు సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ కలిసి శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్‌వి సెట్)ను పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్ ఏర్పాటుకు కళాశాలకు సంబంధించిన మ్యాపులను, కళాశాల విస్తీర్ణం పరిశీలించేందుకు విస్తృతంగా కలియతిరిగారు. ఇందులో భాగంగా వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు అధికారులతో చర్చించారు. కాలేజీకి సంబంధించిన పూర్తి సమాచారంతో తయారు చేసిన మ్యాపులను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సర్వే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌వి సెట్ కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

టిడిపి అభ్యర్థి ప్రచారం ప్రారంభం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ సోమవారం స్థానిక కనికలమ్మ గుడిలో ప్రత్యక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అభ్యర్థితో పాటు తెలుగుదేశం ముఖ్య నేతలు దొరబాబు, మాజీ ఎంఎల్ఎ సికె బాబు పాల్గొన్నారు. ఉదయం నుండీ సాయంత్రం వరకు అగ్రహారం, బ్రాహ్మణవీధి, చిన్న కొత్తూరు, జీకేనగర్, పెద్దకొత్తూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

35 ఏళ్లుగా పార్టీకి సేవ చేశా...

టిడిపి ఎస్సీ సెల్ పార్లమెంటరీ అధ్యక్షులు పీటర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 35 సంవత్సరాల పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేశానని, గతంలో ఎమ్మెల్యే, ఎంపి టికెట్ ఇస్తామని ఇవ్వలేదని, ఈసారైనా ఇస్తారనుకుంటే బాపట్ల నుంచి కొత్త వ్యక్తిని తీసుకొచ్చారని టిడిపి ఎస్సీ సెల్ పార్లమెంటరీ అధ్యక్షులు పీటర్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లాలో సమర్థవంతమైన ఎస్సీ నాయకులు లేరని బాపట్ల నుండీ తీసుకొచ్చి చిత్తూరు ఎంపి టికెట్ ఇస్తున్నట్లు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడం సరికాదన్నారు. కుప్పం నుండీ నగరి వరకు తమిళ దళితుల సంఖ్య అధికంగా ఉందని తనకు చిత్తూరు ఎంపి స్థానం టికెట్ ఇస్తే గెలిచి చూపిస్తానన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. పైనుపల్లి, చీలాపల్లి సర్పంచులు సురేష్, అరుణ్ కుమార్, కరుణాకరన్, మురుగేషన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీటర్

విద్యా పరిశోధన కేంద్రంగా...


'అక్షర' దీపం వెలిగిస్తున్న 'ఎంఎంబిజి'

వీళ్లకు చదువు రాదు, వీళ్లు చదువుకు పనికిరారు, వీళ్లకు చదువు చెప్పలేము అనే వాళ్లను అక్కున చేర్చుకుని వారిని ప్రతిభవంతులుగా తీర్చిదిద్దడంలో ఆయనకు ఆయనే సాటి. చదువులో వెనుకబడిన వారిలో మేథోశక్తిని పెంపొందించేదుకు స్లేట్ ప్యాటర్న్‌ను తన పరిశోధనల ద్వారా రూపొందించి, విద్యార్థుల చేతిరాతను అందంగా మార్చుతున్నారు. తాను కనిపెట్టిన ప్యాటర్న్‌కు 2023 ఏప్రిల్‌లో పేటెంట్ పొందారు. తిరుపతి అన్నారావు సర్కిల్ సమీపంలో 2014లో బాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను స్థాపించి, తెలుగు, ఇంగ్లీషు, హిందీ బాషలపై విద్యార్థులు పట్టుసాధించేలా తన పరిశోధన అంశాల ద్వారా అందిస్తున్నారు.

ప్రజాశక్తి-తిరుపతి సిటి

'విద్య విజ్ఞానాన్ని పంచాలి... విలువలను పెంచాలి.. విద్య వ్యాపారం కాదు వికాసం' అని నమ్మారు చదువుల డాక్టర్ సంగరాజు భాస్కర్‌రాజు. నమ్మడమే కాదు.. శాస్త్రీయంగా నిరూపించారు.. ఎంతోమంది చిన్నారులను పరిశీలించారు.. పరిశోధించారు.. ఫలితాలను రాబట్టారు..ప్రస్తుతం వేలాదిమందికి చదువుల జ్ఞానాన్ని పంచి పెడుతున్నారు.. మేక్ మై బేబీ జీనియస్ విద్యాసంస్థను పరిశోధనా కేంద్రంగా నిలిపారు డాక్టర్ సంగరాజు భాస్కర్‌రాజు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, కుటుంబంలో విషాద ఘటనలు చవి చూసి, అనేక ఒడిదుడుకులు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడి ఉన్నా సంకల్ప బలంతో వెనకడుగు వేయలేదు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యాన్ని వీడలేదు. చదువుపైనే రీసెర్చి చేశారు. సులభంగా, అర్థవంతంగా చదువును ప్రతి ఒక్కరికీ దగ్గర చేయాలనే దృఢ సంకల్పంతో 'అక్షర' దీపం వెలిగిస్తున్నారు. బట్టీ చదువులు వద్దని, పిల్లల్ని ర్యాంకుల యంత్రాలుగా మార్చొద్దని శాస్త్రీయ పద్ధతిలో చైతన్యవంతులను చేస్తున్నారు. 'అక్షర' దీపం వెలుగులో తమ పిల్లల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దిన భాస్కర్‌రాజుకు తల్లిదండ్రుల దీవెనలు విజ్ఞాన శిఖరాలను అధిరోహించేలా చేస్తున్నాయి. భాస్కర్‌రాజు పరిశోధన కేంద్రం (ఎంఎంబిజి) గురించి, విద్యార్థుల్లో విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులే తమ అభిప్రాయాలను వెల్లడించారు. అవి వారి మాటల్లోనే....

ఒత్తిడిలేని విద్య : నాగరాజు, రిటైర్డ్ సాఫ్ట్‌వేర్, తిరుపతి



విద్యార్థులపై ఒత్తిడిలేని విద్యను అందిస్తున్నారు భాస్కర్‌రాజు. నేను 850 రూపాయల వేతనంతో ఉద్యోగంలో చేరి, 2 లక్షల 70వేల రూపాయలు వేతనంతో రిటైరు అయ్యాను. ఉద్యోగ రిత్యా ఈజిప్టు, యుఎస్ఎ, ఇరాక్, యురేనేషియా, తదితర దేశాలు తిరిగాను. తర్వాత తిరుపతిలో స్థిరపడ్డాను. దేశ విదేశాలు తిరగడంతో నా బిడ్డలకు తెలుగు బాష సరిగా రాలేదు. ఎంఎంబిజి గురించి తెలుసుకుని మా బిడ్డలను ఇక్కడ చేర్చాను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ బాషల్లో అనతికాలంలోనే మంచి ప్రావీణ్యం సంపాదించారు. నేను తిరిగిన దేశాల్లో ఎక్కడా ఇలాంటి క్రమబద్ధమైన, ప్రణాళిక బద్ధంగా విద్యార్థులను మెప్పించే రీతిలో విద్యను అందించే సంస్థలు లేవు.

మా పాపకు కంటిసైట్ పోయింది : స్నేహలత, మెడికల్ ఉద్యోగి, తిరుపతి



గత ఏడాది ఓ అసోసియేషన్ మీటింగ్‌పై ఎంఎంబిజి వేదికగా జరిగిన సమావేశానికి హాజరయ్యాను. ఆ సమావేశంలో బాస్కర్‌రాజు కుమార్తె అశ్వని హ్యాండ్‌రైటింగ్ కోర్సుపై అవగాహన కల్పించారు. దీంతో స్ఫూర్తిపొందిన నేను సమ్మర్ క్యాంప్‌లో ఎంఎంబిజి ప్రత్యేక తరగతులకు మా కుమార్తెను పంపాను, పాపకు చదువుపై శ్రద్ధపెరిగింది. చిన్నతనం నుంచే మా పాపకు కంటిచూపు సమస్య ఉంది. పెద్ద పెద్ద డాక్టర్లు పరిశీలించి 25 ఏళ్ల వరకే సైట్ ఉంటుందని, ఆ తరువాత ఆపరేషన్ చేయాలని తేల్చి చెప్పారు. ఎంఎంబిజిలో మా పాప చేరిన తర్వాత కొన్ని రోజులకు కంటి అద్దాల అవసరం లేకుండా పోయింది. డాక్టర్లకు చూపిస్తే పాపకు సైట్ లేదని తేల్చారు. అక్షర దీపమే కాదు, కంటి వెలుగును ప్రసాదించారు.

పిల్లల్లో కాన్ఫిడెన్స్ పెంచుతున్నారు : వెంకట్, ఎస్‌బిఐ మేనేజర్, తిరుపతి



నేను ఎస్‌బిఐ ఉద్యోగి. సాధారణ బదిలీల్లో భాగంగా రకరకాల ప్రాంతాల్లో పనిచేయాల్సి వచ్చింది. ఏడాదిన్నర క్రితం తిరుపతికి మకాం మార్చాం. పిల్లల చదువు కోసం అన్వేషణ చేశాను. ఎంఎంబిజి గురించి తెలుసుకుని బాస్కర్‌రాజును సంప్రదిస్తే మొదట్లో కుదరదన్నారు. రెండో సారి కలిస్తే సరేనన్నాడు. తెలుగు చదవడం సక్రమంగా రాని మా బాబు ఇప్పుడు సంస్కృత శ్లోకాలు చెబుతున్నాడు. భగవద్గీతను అవలీలగా చదివేస్తున్నాడు. గతంలో ఏలూరు సిఆర్ రెడ్డి స్కూల్‌లో చదివిన మా బాబు, ఇప్పుడు దానికి మిన్నగా తయారయ్యాడు. ఇంతటి శాస్త్రీయ పద్ధతిలో విద్యను బోధించే విద్యాసంస్థ తిరుపతిలో ఉండటం నగర వాసుల అదృష్టమనే చెప్పాలి.

పిల్లల దగ్గర నేర్చుకుంటున్నాం : షర్మిల, గృహిణి, తిరుపతి



మేము చెన్నయ్‌లో నివశిస్తున్నాం. ఇటీవల తిరుపతికి రావాల్సి వచ్చింది. తెలుగు మా ఇంటిలో పెద్దవాళ్లు కాస్త మాట్లాడగలరు. చదవడం, రాయడం అసలు రాదు. మా పిల్లలకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ బాషలను నేర్పించాలని బావించి ఎంఎంబిజిలో చేర్చించాం. ఇప్పుడు వారు మాకు తెలుగు రాయడం, చదవడం నేర్పిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో సాటి : హరిప్రసాద్, చిరు ఉద్యోగి, తిరుపతి



పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో సంగరాజు బాస్కర్ రాజు ఆయనకు ఆయనే సాటి. డిగ్రీ డిస్కంటిన్యూ అయిన నేను మా పిల్లలకు మంచి విద్యను అందించాలని, తిరుపతి మొత్తం జల్లెడ పట్టాను. బాస్కర్‌రాజు గురించి, తెలుసుకుని, ఆయన స్కూల్‌లో మా పిల్లలను చేర్పించాను. మా పిల్లల భవిష్యత్తుపై ఇప్పుడు నాకు చింత లేదు. ఎంతో మంది తల్లిదండ్రులు ఆయనకు రుణపడి ఉంటారు.

విలువలతో కూడిన విద్య అవసరం : ఉమాపతి, న్యాయవాది, తిరుపతి



భావిబారత పౌరులైన విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే, విలువలతో కూడిన విద్య అవసరం. ఆ దిశగా భాస్కర్‌రాజు అహర్నిశలు కృషి చేస్తున్నారు. 20 సంవత్సరాలుగా ఆయన నాకు తెలుసు. ఆయనపై నమ్మకంతోనే మా బాబును ఎంఎంబిజిలో చేర్చాను. 3 నెలల్లోనే భగవద్గీత శ్లోకాలను అనర్గళంగా అప్పజెప్పుతున్నాడు. కరోనా వంటి సమయంలో చదువుకాలాన్ని నష్టపోయిన విద్యార్థుల్లో సైతం మానసిక స్థైర్యాన్ని నింపి, వారిలో కాన్ఫిడెన్స్ పెంచి, విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

వచ్చే ఏడాది నుంచే మ్యాథ్స్, సైన్స్‌పై పట్టుసాధిస్తాం -సంగరాజు బాస్కర్‌రాజు, స్లేట్ ఫ్యాటర్న్స్ సృష్టికర్త



ఇప్పటి వరకు ఇంగ్లీషు, హిందీ, తెలుగు బాషపై మా విద్యార్థులు మంచి ప్రావీణ్యం సాధించారు. వచ్చే ఏడాది నుంచి మాకుమాత్రమే సాధ్యమైన పరిశోధన అంశాల ద్వారా సులభమైన రీతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో సైతం పట్టుసాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తాం. రాబోవు విద్యా సంవత్సరంలో 3, 4, 5, 6 తరగతి చదివే విద్యార్థులను పదో తరగతి పరీక్షలను రాయించేందుకు కనీసం 30 నుంచి 50 మంది విద్యార్థులను అందుకు సిద్ధం చేశాం.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు


సోమలలో


నగరిలో

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: రంగు రంగుల హోలీ.. ఆనందాల రంగేళిగా నిలిచింది. స్థానిక మార్వాడీలు నెత్తకుప్పం(నగిరి)పట్నం గల శ్రీనివాస కళ్యాణమండపం వద్ద సోమవారం హోలీ వేడుకలు నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ, డ్యాన్సులు చేస్తూ సంతోషంగా గడిపారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు పిల్లల నుంచి పెద్దల వరకూ.. సంపున్నుల నుంచి సమాన్యుల వరకూ అందరూ ఎంతో ఈ వేడుకలకు హాజరై ఉత్సాహంగా, సంతోషంగా ఈ పండుగను జరుపుకొన్నారు. రంగులు పట్టుకుని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఈ వేడుకలకు మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగులు చల్లుకొని వారితో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీడీభాస్కర్, బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, దయానిధి, ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, మురుగ తదితరులు పాల్గొన్నారు.

వికోట: హోలీ పండుగ సందర్భంగా వికోటలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నాపెద్ద అంతా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. వికోటలో మార్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ పండుగకు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. వారికి చిన్నారులు సరదాగా రంగులు పూశారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, మార్వాడీలు లాభారం, రాథోడ్, దక్షరం, హనుమాన్ సేట్, పీయన్ నాగరాజు, బాలగురునాథ్, తమీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: హోలీ పండుగ పర్వదినాన్ని మండలం లోని పలుచోట్ల పిల్లలు మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. చిన్నారులు రంగులను చేత బూని ఒకరి కొకరు రంగులను పూసుకుంటూ రంగేళి హోలీ అంటూ గట్టిగా కేకలు వేస్తూ ఆనంద ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-సోమల: రంజాన్ సందర్భంగా మండల కేంద్రం లోని మసీదులో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన విందులో యువనాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మసీదు పెద్దలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అమాస మోహన్, ప్రభాకర్, బాషా మస్తాన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను బలి తీసుకోవడమే
సామాజిక న్యాయమా: శ్రీధర్ యాదవ్


కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వ్యవస్థలను చేతిలోకి తీసుకొని అధికారం వైసిపి నేతలకు ఎవరు ఇచ్చారని టిడిపి యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లి పంచాయతీలో సోమవారం రాత్రి పలువురు యాదవులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికార వైసిపి ప్రభుత్వంకు సామాజిక న్యాయం అంటే బీసీలను బలి తీసుకోవడమేనా అని ప్రశ్నించారు. రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరానికి చెందిన పాల సుబ్బయ్య, అతని భార్య పద్మావతి, కుమార్తె వినయలు వైసిపి నేతల వేధింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడి చనిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మునిరాజులు యాదవ్, జ్యోతి యాదవ్, శరవణ కుమార్, చంద్రబాబు, లోకయ్య, వరదరాజులు, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఆదరించండి.. గెలిపించండి: ఎంపీ

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: వైసీపీని మరో సారి ఆదరించి గెలిపించాలని ఎంపీ రెడ్డప్ప కోరారు. మండలంలోని సంక్రాంతిపల్లె పంచాయతీలో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఐదేళ్ల పూర్తి పారదర్శకంగా సంక్షేమ పథకాలను ఇంటింటికి చేర్చామన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి వైసిపి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, చలపతి, మురళి తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తాం..
ఆశీర్వదించండి: కృపాలక్ష్మి



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని.. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి కోరారు. సోమవారం మండలంలోని విజయం, బాల గంగానపల్లి పంచాయతీలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసి లక్ష్మీ ప్రియ, నాయకులు పూర్ణచంద్రారెడ్డి, రామకృష్ణ, గోవిందయ్య, శేఖర్, హనీఫ్ బాషా, బాబురెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: పేదల ఆర్థికాభివృద్ధి వైసిపితోనే సాధ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని టీకేఎం పేట, సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులుయాదవ్, కఠవ రవి, రవిచంద్రబాబుతో పాటు పలువురు వైసీపీలో చేరారు. వారిని డిప్యూటీ సీఎం కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతాబాలాజీ, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, ఎంపీటీసీ ధనరాజ్, పురుషోత్తంరాజు, దనశేఖర్వర్మ, పెద్దిరెడ్డి, రాజారాం యాదవ పలువురు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం.. గెలిపించండి: భరత్

ప్రజాశక్తి-రామకుప్పం: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని మరో సారి ప్రజలంతా వైసీపీకి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ అభ్యర్థించారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కుప్పం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసి నితిన్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, చంద్రారెడ్డి, మురళి, రాజగోపాల్, తల్లి, అప్పి, కేశవరెడ్డి, చెంగారెడ్డి, హేమచంద్రారెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేద్దాం..


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అంగన్వాడీ, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వినియోగించుకునేందుకు ప్రతి ఓటరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సోమల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. రహదారుల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని ఎస్.నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి వద్ద సోమవారం సాయంత్రం చౌడేపల్లి సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ వెంకటనరసింహులు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా పటిష్టంగా కోడ్ అమలు చేస్తున్నామని, మద్యం, ఆయుధాలు వంటి రవాణా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో ట్రెండ్స్ అండ్ టెక్నాలజీస్ రిలేటెడ్ టు సాన్స్క్రిట్ అండ్ కంప్యూటర్ సైన్స్ అనే అంశంపై జాతీయ సదస్సును సోమవారం విశ్వవిద్యాలయం రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలులోని ఐ.ఐ.ఐ.టి. డి.ఎమ్ డైరెక్టర్ ప్రొ.డి.వి.ఎల్.ఎన్. సోమయాజులు విచ్చేసి, విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జె.రమాశ్రీ, ముఖ్య అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ప్రొ ఆర్.జె.రమాశ్రీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.ఎన్.లత, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ, కన్వీనర్‌గా ప్రొ.బి.చంద్రశేఖరం, అడిషనల్ కన్వీనర్ ప్రొ.జి.శ్రీధర్, అధ్యాపకులు డా.ఎమ్.మేరీ సుజాత, డా.జి.నాగలక్ష్మి, డా.జి.ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ అనే స్టార్టప్ కంపెనీ వారు (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)లో భాగంగా తమ ఉద్యోగులతో బ్లడ్ డొనేషన్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌పి కృష్ణ కాంత్ పటేల్ హాజరై రక్తదాన శిబిరం ప్రారంభించారు. స్థానిక బాలాజీ కాలనీలో సోమవారం ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన దాదాపు 35 యూనిట్లు రక్తాన్ని రక్షణ బ్లడ్ బ్యాంకుకి ఎస్పీ సమక్షంలో ఆ కంపెనీ సీఈఓ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజ సేవ కోసం ముందుకు వచ్చిన యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ కంపెనీ యాజమాన్యాన్ని, ఉద్యోగులను అభినందించారు. దాతలకు సర్టిఫి అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి భాస్కర్ రెడ్డి, సిఐలు శ్రీనివాసులు, జయ నాయక్, ఎస్సై బాలకృష్ణ, యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈవో వినయ్, ఆపరేషన్స్ మేనేజర్ రైని, మార్కెటింగ్ మేనేజర్ కిరణ్ కుమార్, హెచ్‌ఆర్ శివతేజ, రక్షణ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, బ్లూ కోల్ట్ సిబ్బంది, స్టార్ట్ అప్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

మొదలైన మద్యం కేసులు.. గ్రామాల్లో వేధింపులు

టిడిపి జిల్లా కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు

ప్రజాశక్తి- బుచ్చి నాయుడు కండ్రిగ: రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి రాకుండా అడ్డుకోవడంలో భాగంగా అడ్డగోలు కేసులు నమోదు చేస్తున్నారని టిడిపి తిరుపతి జిల్లా కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద పర్యవేక్షణలో ఉన్న సిబ్బంది ద్వారా సమాచారం అందుకుంటున్న సెబ్ సిబ్బంది దారి కాచి తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బలంగా నిలబడి ప్రశ్నించే వారిని టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకు లను మాటల నమ్మి అరెస్టులు చేయడం దారుణమన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం
రాకపోవడానికి పెత్తందారులే కారణం: బిఎస్‌పి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలో దశాబ్దాలుగా ఎన్నికలు జరుగుతున్న నేటికీ బహుజనులకు రాజ్యాధికారం రాకపోవడానికి పెత్తందారుల పార్టీలే కారణమని, పెత్తందార్ల పార్టీల వైపు ఉంటే బహుజనులకు ఎప్పటికీ న్యాయం జరగదని మాజీ తెలంగాణ సిఐడి డీజీపీ, బిఎస్పి ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి పూర్ణచంద్ర అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో బహుజన సమాజ్ పార్టీ రెండో విడత అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్ర మాట్లాడుతూ రాయలసీమ పరిధిలో 63 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, అందులో 40 రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. దీన్ని చూస్తేనే బహుజనులకు ఎంతటి ప్రాధాన్యత రాయలసీమలో ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుసుకోవచ్చన్నారు. 10 శాతం లేని సామాజిక వర్గం వారు 40 స్థానాల్లో ఉన్నారంటే వారి వెనుక మాయ మాటలు విని ఉన్న బహుజనులు ఉన్నారన్నారు. 63 స్థానాల్లో ఒక ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా అసెంబ్లీలో అడుగుపెట్టనివ్వలేదన్నారు.

బీసీల సత్తా ఎన్నికల్లో చూపుదాం: రుద్రకోటి


మాట్లాడుతున్న నాయకుడు రుద్రకోటి సదాశివం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని అధికార వైసిపి చిత్ర హంసలకు గురి చేస్తూ హత్యలు చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీసీల సత్తా చూపీ వైసీపీని ఇంటికి పంపుతామని టిడిపి తిరు పతి పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం హెచ్చరించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యా ప్తంగా బీసీలను అనగదొక్కే ప్రయత్నంలో భాగ ంగా వివిధ రకాలుగా హింసించి హత్యలు చేయి స్తున్నారని అధికార పార్టీపై మండిపడ్డారు. ఇటీ వల కడప జిల్లాకు చెందిన సుబ్బారావు, పద్మావతి, వినయ కుటుంబ సభ్యులకు సంబంధించిన స్వయార్జితమైన భూమి సర్వేనెంబర్ 21/87/2 లో 3.10 ఎకరాల భూమిని స్థానిక వైసిపి నాయకులు ఆన్లైన్లో పేరు మార్చి చివరికి ఆ కుటుంబం మూకుమ్మడి ఆత్మహత్యకు పాల్పడేలా చేశారన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటూ కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు చేర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. వైసిపి దృష్టిలో సామాజిక న్యాయం అంటే బీసీలను టార్గెట్ చేసి హత్య చేయడమేనా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సత్తు మధుసూదన్ యాదవ్, జగన్నాథం, భక్తవత్సలం, రామయ్య, సత్యవతి, అశోక్ పాల్గొన్నారు.

మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎడ్యుకేషన్ విభాగం పరిశోధక విద్యార్థి గాజులపల్లె మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు ఆచార్య వి. దయాకర రెడ్డి పర్యవేక్షణలో "ఇన్ఫ్లూయన్స్ ఆఫ్ అడ్జస్ట్మెంట్ ప్రాబ్లమ్స్ అన్ ది అచీవ్మెంట్ ఆఫ్ యస్.సి స్టూడెంట్స్ ఇన్ రెసిడెన్షియల్ అండ్ నాన్-రెసిడెన్షియల్ స్కూల్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. ఇందుకుగాను ఆయనకు ఎస్వీయూ పిహెచ్.డి డిగ్రీని ప్రదానం చేసింది. మధుసూదన్ రెడ్డికి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు, జి. మధుసూదన్ రెడ్డి ప్రస్తుతం సిదార్థ బి.ఇడ్ కాలేజి, నెల్లూరులో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

స్వచ్ఛందంగా ఓటు హక్కును
వినియోగించుకోవాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి -ఏర్పేడు: స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డిఎస్‌పి భవ్య కిషోర్ అన్నారు. మండలంలోని కందాడు గ్రామంలో రేణిగుంట డిఎస్పి భవ్య కిషోర్, ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2024 ఎన్నికల ప్రవర్తన, నియమావళి గురించి వివరించారు. ప్రజలు నిర్భయంగా స్వచ్ఛందంగా వారి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా సదస్సు ఏర్పాటు చేసుకొని స్థానిక సమస్యలపై అవగాహన కల్పించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవా సంస్థ కార్యాల యంలో పేదలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పోణకా అది శేషారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మల్లికార్జున్ రెడ్డి వ్యవహరించారు.

ఆలయానికి 100 ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి తిరుపతికి చెందిన రాయలసీమ ఏజెన్సీ అధినేత ఉష సోమవారం రూ.1.50 లక్షలు విలువజేసే 100 సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందించారు. వేసవికాలం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఫ్యాన్లను వితరణ చేశారని ఉష తెలిపారు.

అంగరంగ వైభవంగా
లక్ష్మీనరసింహ స్వామి చక్రస్నానం


వెదురుకుప్పంలో

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఎస్ఆర్ పురం మండలం మంగుంట గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. చివరి రోజైన సోమవారం చక్రస్థానంతో ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ ధర్మకర్త జెడ్పిటిసి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం సుప్రభాతం, అభిషేకం, మహా మంగళహారతి అలాగే కలశారాధన అంకురార్పణం యాగశాల ప్రవేశం ఆరాధన గణపతి పూజ లు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మోహనప్రసాద్, జలజ, గిరిబాబు, హిమబిందు, జయప్రద, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు


అర్ధగిరిలో

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని అరగొండ అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు అలాగే 11 గంటలకు ఆలయ మండపంలో అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై ఉంచి ఆలయ పవిత్ర సంజీవరాయణి పుష్కరిణి చుట్టూ మంగళ వాయిద్యాలు నడుమ ప్రదక్షణ చేయించారు. ఈ పౌర్ణమి వేడుకల్లో ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి ఈవో హనుమంతరావు వివిధ ప్రాంతాల్లో చేసిన భక్తులు పాల్గొన్నారు భక్తుల కాలక్షేప నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నైనేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

- వెయ్యి మందికి అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని డిఎంపురం పంచాయితీ డేరా కండిగా సమీపంలో ప్రసిద్ధి చెందిన శ్రీ నైనేరమ్మ ఆలయంలో సోమవారం పౌర్ణమి పూజలు ఉపాధ్యాయులు బి.ఆనందుడు, కె.బొబ్బిలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి, అనంతరం గణపతి పూజ,సత్యనారాయణ వ్రతం పూజ కార్యక్రమాలు పుత్తూరు, సురేంద్ర నగరం, డిఎం పురం, ద్వారకానగరం,డేరా కండిగ, కేఎం పురం, గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శ్రీవారి చక్రస్నానం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఆవులపల్లె గ్రామంలో వెలసిన అతి పురాతన ఆలయమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారి మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకం తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల గోవింద నామస్మరణ నడుమ శ్రీవారి చక్ర స్నానాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి హంస వాహనంపై అధిష్టింపజేసి పురవీధులలో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపు సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలుకుతూ కర్పూర హారతులను అందజేశారు. గ్రామోత్సవానంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని పురోహితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

గుండెపోటుతో విఆర్‌ఏ మృతి



ప్రజాశక్తి-వికోట: వీకోట రెవెన్యూ కార్యా లయంలో విఆర్‌ఏగా విధులు నిర్వహి స్తున్న రెడ్డప్ప ఆదివారం రాత్రి గుండ పోటుకు గురై మృతి చెందారు. వీకోట లో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తూ మండల ప్రజలకు సుపరిచితులైన సీనియర్ వీఆర్‌ఏ రెడ్డప్ప గుండెపోటు తో మృతి చెందడం పట్ల రెవెన్యూ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. విషయం తెలుసుకున్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు వీఆర్‌ఏ భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. మండల సిఐటియు అనుబంధ సంఘాలు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, రాణి(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం బైరెడ్డిపల్లిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాణి(35) తన కష్టంతో కుమార్తెను పోషిస్తూ ఉంది. గతంలోనే ఆమె భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమార్తెను పోషిస్తూ జీవనం సాగిస్తున్న రాణి సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో అనుమానాస్పదంగా మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చెరుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ లింగీసుగుంటకట్ట వద్ద కన్నికలమ్మ ఆలయం పక్కనే ఉన్న చెట్టుకు భాస్కర్(45) అనే వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు ఏకాంబరకుప్పంకు చెందిన భాస్కర్ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమౌతున్నాడు. దీంతో ఆదివారం రాత్రి ఇంటినుంచి వచ్చేసిన అతను ఎవరూ లేని సమయంలో ఆలయం పక్కనే ఉన్న భవనంపైకి ఎక్కి చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తిరుపతి సిటీ: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా విడపనపల్లి మండలానికి చెందిన వీరేష్ (24) కొంతకాలంగా కూలీ పనులు చేసుకుంటూ ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే కట్టకిందపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తన తండ్రికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్థాపాన్ని గురైన వీరేష్ సోమవారం మద్యం సేవించి తానున్న ఇంటిలోనే ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యం మత్తులో తన మిత్రుడు శంకరుకు తాను చనిపోతున్నానని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే స్నేహితుడు ఆ ఇంటికి సమీపంలోనే ఉన్న మృతుడి అక్క బావకు సమాచారం అందించాడు. వారు ఇంటికి వచ్చే సరికి వీరేష్ ఉరికి వేలాడుతున్నాడు. హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి అక్క సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.